# ఆర్టీసీ కార్మికులకు రేవంత్ మోసం

- డమ్మీ చెక్కులిచ్చి దగా చేసిన సీఎం
- ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాలి
- పాలన సాగించడం సీఎంకు చాతనైతలేదు
- రుణమాఫీ మీద దేవుళ్లపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఒట్టుపెట్టి మాటతప్పిండ్రు
- నా ఒత్తిడితోనే కాంగ్రెస్ సర్కార్ రుణమాఫీని సగమైనా అమలు చేసింది
- కాంగ్రెస్‌పై మాజీ మంత్రి హరీశ్ ధ్వజం

హైదరాబాద్, ఫిబ్రవరి 8(నమస్తేతెలంగాణ): ఆర్టీసీ కార్మికులకు డమ్మీ చెక్కులు ఇచ్చి మోసం చేసిన ఘనత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికే దక్కిందని మాజీ మంత్రి హరీశ్‌రావు ఎద్దేవా చేశారు. శనివారం ఆయన ఓ టీవీ చానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ, హామీల అమలు కోసం ప్రతిపక్షంగా బీఆర్‌ఎస్ చేస్తున్న పోరాటాన్ని వివరించారు. తాము అధికారంలో ఉన్నప్పుడు ఆర్టీసీ విలీనాన్ని చివరి దశకు తీసుకొచ్చామని, మళ్లీ అధికారంలోకి వచ్చిన మొదటి రోజే పూర్తి చేస్తామని హామీ ఇచ్చామని గుర్తు చేశారు. కాంగ్రెస్ సైతం ఇదే హామీని ఇచ్చి ఇప్పటికీ అమలు చేయలేదన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ 420 హామీలిచ్చి గద్దెనెక్కిన తరువాత రేవంత్‌కు పాలన చేతకావడం లేదని విమర్శించారు. తాను నిత్యం వెంటపడి ఒత్తిడి చేయడంతోనే కనీసం సగమైనా రైతులకు రుణమాఫీ చేశారన్నారు. అధికారంలోకి వచ్చిన వెంటనే మహిళలకు నెలకు రూ. 2500, వృద్ధులు, వికలాంగులకు పింఛన్లు పెంచుతామని చెప్పిన కాంగ్రెస్ పార్టీ ఇప్పుడు ఆ ఊసే ఎత్తడం లేదని దుయ్యబట్టారు. కులవృత్తుల వారికి ఇచ్చే ఆర్థిక సాయం, రెండు విడుతల రైతుబంధు, కేసీఆర్ కిట్లు ఎగ్గొట్టి కేవలం రూ. 16 వేల కోట్లు మాత్రమే రుణమాఫీ చేశారని చెప్పారు. ప్రభుత్వం ఏర్పడిన వెంటనే విమర్శలు చేయడం సరికాదని, ఏడాదిపాటు కేసీఆర్ మౌనంగా ఉన్నారని పేర్కొన్నారు. అంతేగానీ ఫామ్‌హౌస్ నుంచి బయటకు రాలేకకాదని హరీశ్‌రావు తెలిపారు. ప్రజల తరపున అటు అసెంబ్లీలో, ఇటు ప్రజాక్షేత్రంలో బీఆర్‌ఎస్ నిరంతరం కొట్లాడుతున్నదని చెప్పారు. ఏడాదిలో రేవంత్ సర్కారు అసమర్థ విధానాలను అడుగడుగునా ఎండగట్టడంలో బీఆర్‌ఎస్ సఫలమైందన్నారు. హైడ్రా, లగచర్ల బాధితులకు అండగా నిలిచామని గుర్తుచేశారు. అలాగే పెండింగ్ బిల్లుల కోసం రోడ్డెక్కిన మాజీ సర్పంచులకు సైతం బాసటగా నిలిచామని చెప్పారు. ప్రభుత్వం 10 శాతం కమిషన్లు తీసుకొని బడా కాంట్రాక్టర్లకు అప్పనంగా ప్రభుత్వ ఆస్తులు కట్టబెడుతున్నదని ఆరోపించారు. పెండింగ్ బిల్లుల కోసం మాజీ సర్పంచ్‌లు రోడ్డెక్కినా ఐదారు వందల కోట్లు ఇవ్వకుండా వేధిస్తున్నదని దుయ్యబట్టారు. కులగణన పేరిట రేవంత్‌రెడ్డి బీసీలకు అన్యాయం చేశారని, దీంతో బీసీ సంఘాల నాయకులంతా భగ్గుమంటున్నారన్నారు. స్వయంగా కాంగ్రెస్ ఎమ్మెల్సీనే ఆ నివేదికను తగులబెట్టారంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చని అన్నారు. ఎస్సీ వర్గీకరణలో రేవంత్‌రెడ్డి పాత్రేమీలేదని, మందకృష్ణ, వంగపల్లి శ్రీనివాస్ మాదిగల కృషి, సుప్రీంకోర్టు తీర్పుతోనే వర్గీకరణ కల సాకారమైందన్నారు. ఇప్పటికైనా రేవంత్‌రెడ్డి ప్రగల్భాలు మాని పాలనపై దృష్టిపెట్టాలని హరీశ్‌రావు హితవు పలికారు.

## టీజీ ఈసెట్ షెడ్యూల్ విడుదల

### మార్చి 3 నుంచి దరఖాస్తుల స్వీకరణ

### మే 12న ఆన్‌లైన్‌లో పరీక్ష

హైదరాబాద్, ఫిబ్రవరి 8 (నమస్తే తెలంగాణ) : తెలంగాణ రాష్ట్ర ఇంజినీరింగ్ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్ షెడ్యూల్ విడుదలైంది. పాలిటెక్నిక్, బీఎస్సీ గణితం కోర్సులు పూర్తిచేసిన వారికి బీటెక్/ బీఈ/ బీఫార్మసీ కోర్సుల్లో లేటరల్ ఎంట్రీ విధానంలో రెండో సంవత్సరంలో ప్రవేశాలకు ఈసెట్ రాయాల్సి ఉంటుంది. ఈ నెల 25న ఈసెట్ నోటిఫికేషన్‌ను విడుదల చేయనున్నారు. ఈ మేరకు మాసాబ్‌ట్యాంక్‌లోని ఉన్నత విద్యామండలిలో శనివారం నిర్వహించిన సెట్ కమిటీ సమావేశంలో ఈసెట్ షెడ్యూల్‌ను విడుదల చేశారు. మార్చి 3 నుంచి ఏప్రిల్ 19 వరకు దరఖాస్తులను స్వీకరించనున్నారు. ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగ అభ్యర్థులు రూ.500, మిగతా వారు రూ. 900 పరీక్ష ఫీజుగా చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. మే 12న ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు ఆన్‌లైన్ విధానంలో పరీక్ష నిర్వహించనున్నట్టు కన్వీనర్ ప్రొఫెసర్ చంద్రశేఖర్ తెలిపారు.

## 15 నిమిషాల ముందే గేట్లు క్లోజ్

### నిమిషం ఆలస్యం నిబంధనకు బదులు కొత్త రూల్

### ఎప్‌సెట్, ఎడ్‌సెట్ సహా అన్ని పరీక్షల్లోనూ అమలు

హైదరాబాద్, ఫిబ్రవరి 8 (నమస్తే, తెలంగాణ): ఇంజినీరింగ్, ఎప్‌సెట్, ఎడ్‌సెట్, ఐసెట్ సహా పలు ప్రవేశ పరీక్షలకు సంబంధించి సెట్ కమిటీ కొత్త నిబంధన తీసుకొచ్చింది. ప్రవేశ పరీక్షల్లో నిమిషం ఆలస్యమైనా అనుమతించకూడదని నిబంధన అమలవుతున్నది. ఇకపై పరీక్ష సమయానికి 15 నిమిషాల ముందు వచ్చిన అభ్యర్థులనే సెంటర్ లోపలకి అనుమతిస్తామని స్పష్టంచేసింది. 15 నిమిషాల ముందే గేట్లను మూసేయనున్నట్టు వెల్లడించింది. టీజీపీఎస్సీ పరీక్షలకు అరగంట ముందుగా గేట్లు మూసేస్తున్నారు. జేఈఈ, నీట్‌లోనూ ఇదే నిబంధన అమలువుతన్నది.

















